గెడా రంగారావు

విషం తినే మనుషులు!

అజీజ్

సిగరెట్ అంటించి, ఆ కేసు గురించి ఆలోచిస్తూ కూర్చున్నాను నా ఆఫీసులో.

గడచిన ఐదురోజులనించీ మద్రాసు నగరంలో రెండు విచిత్రమైన హత్యలు జరిగేయి. ఆ హత్యలు ఇటు పోలీస్ డిపార్టుమెంట్‌లోనూ, అటు పత్రికల్లోనూ, ప్రజల్లోనూ తీవ్ర సంచలనం లేవదీసేయి.

ఆ కేసు తక్షణం క్రైం బ్రాంచికి, అంటే నాకు అప్పగించబడింది. ఐదురోజుల్నించీ నిద్రాహారాలు మాని ప్రయత్నిస్తున్నాను. ఐనా, హంతకుని ఆచూకీ దొరకడంలేదు. అంతేకాదు, ఆ హత్యలకి కారణాలుకూడా స్పష్టంగా తెలీడంలేదు.

చంపబడ్డ ఇద్దరూ అందమైన యువతులు!

ఐదురోజుల క్రితం శాంథోం బీచి ప్రాంతంలో ఓ శవం కనిపించింది. పాతికేళ్ళ అందమైన యువతి శవం. ఆమె రెండు కళ్ళూ పీకెయ్యబడ్డాయి. కళ్ళు ఉండవలసినచోట రెండు వికృతమైన గుంటలు! గొంతు నులిమి చంపబడిందని డాక్టర్ చెప్పేడు.

ఆరా తియ్యగా, ఆ యువతి పేరు పూర్ణిమ అనీ, పడుపువృత్తిజేసుకు బ్రతికేదనీ, చీకటిపడగానే అందంగా తయారై పార్కుల్లోనో, బీచిల్లోనో, క్లబ్బుల్లోనో రోజూ ఎవ్వరో ఒకర్ని వల్లోవేసుకుని హోటళ్ళల్లో గడిపేదనీ తెలిసింది.

ఆ రాత్రికూడా ఆమెని శాంథోం బీచి ప్రాంతంలో ఓ మగాడివెంట, ఇద్దరు ముగ్గురు చూడ్డం జరిగింది. అంటే, అంతకిమించి మరేం తేలలేదు.

ఇలాగే, విశాలాక్షి అనబడే ఓ పాతికేళ్ళ విద్యార్థిని హత్య జరిగింది. సాయంత్రం ఏడుగంటల ప్రాంతంలో తన స్నేహితురాలి దగ్గిర బయోలజీ నోట్స్ పట్టుకొస్తానని చెప్పి వెళ్ళింది విశాలాక్షి. అంతే, ఉదయం విక్టోరియా పార్కులో బెంచిమీద ఆమె శవం కనిపించింది.

ఆ శవానికి కళ్ళు లేవు!

ఆమెకూడా గొంతు నులిమి చంపబడింది. పై రెండు హత్యాప్రదేశాల్లోనూ హంతకునికి సంబంధించిన ఎలాటి ఆధారాలూ కనిపించలేదు. విచిత్రం ఏమిటంటే, మరణించక ముందు వారితో ఎలాటి బలాత్కారం, అంటే మానభంగం జరపబడలేదు.

శవాల ఒంటిమీద ఎలాటి గాయాలూ లేవు. నా పరి

శోధనలో తేలిన ముఖ్య విషయం మరణించిన ఇద్దరివీ ఎంతో అందమైన కళ్ళు! శవాల గొంతుల చుట్టూ ఎలాటి వేలిముద్రలు దొరకలేదు. హంతకుడు గ్లాస్ తొడుక్కొని జాగ్రత్త పడుంటాడు.

శవాల కళ్ళు తీసిన తీరునిబట్టి, ఆ కళ్ళను ఎంతో జాగ్రత్తగా ఆపరేట్ జేసి తీసినట్టు తేలింది. ఒక డాక్టర్ తప్ప, ఆ విధంగా మరొకరు తియ్యలేరని పోలీస్ డాక్టర్ల అభిప్రాయం. హంతకుడి విషయంలో మేము వేసుకున్న ఒకేఒక అంచనా ఇది. అతను డాక్టర్! శస్త్రచికిత్స తెలిసిన మంచి అప్తామాలజిస్ట్!

ఎవ్వరతను? మద్రాసు మహానగరంలో వేలసంఖ్యలో ఉన్న డాక్టర్లలో ఎవ్వరని పసిగట్టేది? అందమైన కళ్ళ కోసం నిండుప్రాణాలను బలిగొంటున్న అతను పిచ్చివాడా? ఏ ఉద్దేశంతో కళ్ళు కాజేస్తున్నాడు?

ఇద్దరితోనే సరిపెడతాడా? లేక, మరిన్ని హత్యలు జేస్తాడా? ఇవి సైకో.మర్డర్సా? ఏ స్త్రీ వల్లనో మనసు గాయపడి మతి స్థిమితంలేని మానసికరోగి జేస్తున్న హత్యలా?

ఇదే నిజమైతే ఆ వ్యక్తికి అందమైన కళ్ళుగల ప్రతి స్త్రీపట్లా విపరీతమైన ద్వేషం నిండివుంటుంది.

నా ఆలోచనాసరళిని తుంచివేస్తూ టేబిల్ మీది ఫోన్ మోగింది. రిసీవర్ అందుకుని, "ఎస్! ఇన్స్పెక్టర్ రాజారెడ్డి స్పీకింగ్!" అన్నాను.

"నేను అడయార్ పోలీస్ సబిన్స్పెక్టర్ని సార్!"

"ఏమిటి?"

"మరో హత్య జరిగింది!"

"ఎక్కడ?"

"అడయార్ లేబర్ కాలనీ దగ్గర, కొత్తగా ఓ బిల్డింగ్ కడుతున్నారు. ఆ బిల్డింగ్ కాంపౌండ్‌లో పడుంది శవం!"

"అందమైన అమ్మాయిదేనా?"

"నో. నో! పాతికేళ్ళ యువకుడిది!"

"ఇప్పుడే వస్తున్నాను" అని రిసీవర్ దించి లేస్తూ టైం చూసుకున్నాను.

ఉదయం ఏడున్నర!

నా అసిస్టెంట్, సార్జంట్ డేవిడ్‌తో జీప్ ఎక్కాను.

2

ఆ బిల్డింగ్ చుట్టూ కాలనీ జనం మూగివున్నారు. కాంపౌండ్‌లో జీప్ ఆపి దిగేను. ఇంకా కట్టబడుతున్న బిల్డింగ్ అది. కాంపౌండ్‌లో అక్కడక్కడా కాంక్రీటూ, రాళ్ళూ, ఇటికెలూ కుప్పలుగా పడున్నాయి.

మమ్మల్ని చూడగానే అడయార్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సెల్యూట్ కొట్టి, శవం పడున్నచోటికి తీసికెళ్లేడు.

కాంపౌండ్‌లో ఓ మూల వెల్లకిలా పడుంది శవం.

శవాన్ని చూసి నివ్వెరబోయేను.

అది కళ్ళు లేని శవం!

గతంలో జరిగిన హత్యలకీ, ఈ హత్యకీ లింకు వుందని స్పష్టమైంది. హంతకుడు అందమైన ఆడవాళ్ళనే చంపుతున్నాడనుకున్న నా అంచనా, దీనితో తారుమారయింది.

ఆలోచిస్తూ శవాన్ని పరీక్షగా చూసేను. ఎర్రగా, బుర్రగా వున్న పాతికేళ్ళ యువకుడు. ఖరీదైన బెల్ బాటమ్ సూటు. కాళ్ళకి బూట్సు. మెడలో బంగారు గొలుసు. ఎవ్వరో ధనిక కుటుంబానికి చెందినవాడై వుంటాడు.

"శవం ఇక్కడుందని మీకెలా తెలిసింది?" అడిగేను సబిన్‌స్పెక్టర్ని.

"ఇక్కడ పనిజేసే ఓ కూలీ, ఉదయం ఏడుగంటలకి వచ్చి చూసి పరిగెత్తికెళ్ళి కాలనీవాళ్ళని పిల్చుకువచ్చేడు. వాళ్ళే మాకు ఫోన్ జేసి చెప్పేరు."

"ఆ కూలీ ఇక్కడే వున్నాడా?"

ఇన్‌స్పెక్టర్ తలూపి, కానిస్టేబుల్‌కు సైగ చేసేడు.

కూలీ రాగానే, "ఈ బిల్డింగ్ ఎవరు కట్టిస్తున్నారు?" అడిగేను.

"తీరథ్‌నాథ్ గారండి!"

"ఎక్కడుంటాడాయన?"

"తెలీదండి. మూర్‌మార్కెట్‌లో ఆళ్ళకి పెద్ద వెండి, బంగారం దుకాణ ముందండి."

"నీవు శవాన్ని పరీక్షగా చూసేవా?"

"లేదండి. కాంపౌండ్‌లోకి రాగానే, మూలపడున్న శవం కనిపించిందండి. భయమేసి కాల్నీలోకి పరిగెత్తేనండి."

"సరే, శవాన్ని కాస్త పరీక్షగా చూసి చెప్పు. అత న్నెప్పుడైనా, ఎక్కడైనా చూశావేమో!" అన్నాను.

కూలీ శవాన్ని చూసేడు.

గుడ్లు తేలవేసి అలా చూస్తూ వుండిపోయేడు.

"గుర్తుపట్టేవా?" అడిగేను కుతూహలంగా.

"ఔనండి! ఈన ప్రసాదుబాబుగారండి" అన్నాడు వణికే కంఠంతో.

"ఏ ప్రసాద్‌బాబు?"

"తెలీదండి. ఒకటి రెండుసార్లు మా యజమానిగా రెంట ఈడికొస్తే చూసేను."

"ఒంటరిగా వచ్చేవాడు కాదా?"

కూలీ క్షణం ఆలోచించి, "ఓమారు ఓ అమ్మాయి వెంట కూడా వచ్చినట్టు జ్ఞాపకమండి" అన్నాడు.

"ఎవరా అమ్మాయి?"

"తెలీదండి!"

"మీ యజమాని తీర్థనాథ్ కీ, ఇతనికీ ఏదైనా బంధుత్వమా?"

"ఈడ కూలిజేసుకు బ్రతికేవాళ్ళం. అవన్నీ మాకెట్టా తెలుస్తాయి బాబూ?"

ఇంకా ఏదో అడగబోతున్నాను. అదే సమయంలో ఓ కారు కాంపౌండ్ లోకి ప్రవేశించడంతో ఆగి, అటు చూసేను. డ్రైవింగ్ సీట్లోంచి ఫుల్ సూట్ లో వున్న ఓ యువకుడు దిగి అడుగులో అడుగు వేసుకుంటూ మమ్మల్ని సమీపించేడు.

ఓసారి అందర్నీ పరికించి, "గుడ్ మార్నింగ్ ఇన్ స్పెక్టర్! నా పేరు తీర్థనాథ్!" అన్నాడు చాలా నింపాదిగా.

తలూపి, "గ్లాడ్ టు మీట్ యూ! నేనే మిమ్మల్ని కలుసుకోవా లనుకుంటున్నాను. ఈ బిల్డింగ్ మీరే కట్టిస్తున్నారు కదూ?" అడిగేను.

అతను తలూపి, కింద పడున్న శవాన్ని చూడసాగేడు.

"ఈ యువకుడు ఎవరో మీకు తెలుసా?" అడిగేను అతన్ని పరీక్షగా చూస్తూ.

తీర్థనాథ్ మెల్లిగా తలెత్తి, "తెలుసు! ఇతను నా ప్రైవేట్ సెక్రెటరీ ప్రసాదరావ్!" అన్నాడు.

తన సెక్రెటరీ, అంత దయనీయంగా చచ్చిపడుండటం కళ్ళారాచూస్తున్నా అతని మొహంలో ఎలాటి భావాలూ లేకపోడం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది.

"మిస్టర్ తీర్థనాథ్! మీ సెక్రెటరీ ఇక్కడ చచ్చిపడున్నాడని మీకు ముందే తెలుసా?" అడిగేను అతని కళ్ళల్లోకి చూస్తూ. తీర్థనాథ్ తలూపి, "తెలుసు!" అన్నాడు ముక్తసరిగా.

"ఎలా తెలుసు?"

"ఇప్పుడే, కారు కాంపౌండ్‌లోకి తిప్పుతుండగా, బైట నిల్చున్న కాలనీ జనంలో ఎవ్వరో చెప్పేరు!"

నిట్టూర్చేను. కొందరి తత్వం ఇంతే. మిన్ను విరిగి మీద పడ్డా తొణకరూ, బెణకరు.

"ప్రసాదరావ్ ఎన్నాళ్ళనించి మీ దగ్గిర పనిజేసేవాడు?"

"దాదాపు రెండేళ్ళనించి."

"అతను నిజంగా మీ ప్రైవేట్ సెక్రెటరీయేనా?" అడిగేను అనుమానంగా.

"ఔను. ఇందులో మీరు అనుమానించవలసిందేమీ లేదే!"

నవ్వేను. "మిస్టర్ తీర్థనాథ్! వెండి, బంగారు వ్యాపారులకి సైతం ప్రైవేట్ సెక్రెటరీల అవసరం వుంటుందని నాకిప్పుడే తెలిసింది."

తీర్థనాథ్ నవ్వి, "మీ అనుమానం సరైనదే. ఆ వ్యాపారంతో బాటు నాకు మరో రెండు మూడు వ్యాపారాలు వున్నాయి. ఒక్కణ్ణీ అవన్నీ చూసుకోలేక, ప్రసాదరావ్‌ని సెక్రెటరీగా పెట్టుకున్నాను" అన్నాడు.

"అతన్ని పెట్టుకోమని ఎవరైనా సిఫార్సు చేసేరా?"

"ఎవ్వరో సిఫార్సు చెయ్యడం ఏమిటి? అతను స్కూల్ ఫైనల్లో నా క్లాస్ మేట్. బాల్య స్నేహితుడు."

సిగరెట్ అంటించి, "ప్రసాదరావ్ ఎలాటివాడు?" అడిగేను.

"స్నేహపాత్రుడు. కష్టపడి పనిజేసేవాడు. బి. ఏ. పూర్తిజేసి నిరుద్యోగిగా తిరుగుతుంటే నేనే పిలిచి ఉద్యోగం ఇచ్చేను."

"మీ రెంతవరకు చదువుకున్నారు?"

"ఎమ్. బి. బి. ఎస్!"

తీర్థనాథ్ అన్న ఈ మాటతో నాకు షాక్ తగిలినట్టు తోచింది. నా భావాలు వ్యక్తం కానివ్వకుండా, "డాక్టర్ డిగ్రీ పుచ్చుకున్న మీరు వైద్యరంగంలో ప్రవేశించకుండా, వ్యాపారం దేనికి చేపట్టేరు?" అడిగేను.

తీర్థనాథ్ నవ్వి, "నేను డాక్టర్ డిగ్రీ పుచ్చుకోలేదు. మూడో సంవత్సరం పూర్తిజేసి మానేసేను" అన్నాడు.

"ప్రసాదరావ్ కి పెళ్ళయిందా?" అడిగేను అసలు విషయానికి వస్తూ.

"ఇంకా కాలేదు. చేసుకునే ప్రయత్నాలు జేస్తున్నాడని తెలిసింది."

"అతను తరుచూ ఓ అమ్మాయి వెంట ఇక్కడికి వచ్చేవాడుట ఈ విషయం మీకు తెలుసా?"

"తెలుసు!"

"ఎలా?"

"ఆ అమ్మాయే స్వయంగా నాకు చెప్పింది!"

"అంటే, మీకూ ఆ అమ్మాయితో పరిచయం ఉందన్న మాట!"

"పరిచయం ఏమిటి? ఆమె నా అక్కయ్యే!" అన్నాడు తీర్థనాథ్ నింపాదిగా.

కాసేపు నానోట మాట పెగల్లేదు.

తిరిగి అతనే అన్నాడు: "ఆమె ప్రసాదరావుని విపరీతంగా ప్రేమించడం మొదలుపెట్టింది. పెళ్ళిజేసుకుంటే, అతన్నే జేసుకుంటానని నాతో చెప్పేది కూడా!"

"ఆ విషయంలో మీరేం నిర్ణయం తీసుకున్నారు?"

"ఇంకా ఏ నిర్ణయమూ తీసుకోలేదు. ఇంతలో ప్రసాదరావ్ ఇలా పోయేడు."

"ప్రసాదరావు వయసూ, మీ వయసూ దాదాపు ఒక్కటే అనిపిస్తోంది. అంటే, మీ అక్కయ్య ప్రసాదరావుకన్నా వయసులో పెద్దదన్నమాట?"

తీర్థనాథ్ తలూపి, "ఔను!" అన్నాడు.

"ఆమె పేరు తెలుసుకోవచ్చా?"

"రత్నరాశి!" అన్నాడు తీర్థనాథ్.

"ఆమె ఇప్పు డెక్కడుంది?"

"మా నాన్నగారి అంటే మా పాత ఇంట్లో!"

"మీ నాన్నగారు ఉన్నారా?"

"నో.నో! ఆయన గుండెజబ్బుతో హఠాత్తుగా పోవడం వల్లే నా చదువు పూర్తిజెయ్యకుండా ఆపి, వ్యాపారంలో దిగవలసి వచ్చింది. మా నాన్నకి నేనొక్కణ్ణే మగ సంతానం.

ఆయన చివరి రోజులు తాంబరంలో ఉన్న మా పాత ఇంట్లో గడిచేయి. ఆయన పోయేక, అక్కయ్య అందులో ఉంటోంది!"

"మీ బాల్య స్నేహితుడు, ప్రైవేట్ సెక్రటరీ,

కాబోయే బావ ఐన ప్రసాదరావు, ఇలా ఘోరంగా హత్య జెయ్యబడటం మీమీద ఎటువంటి ప్రభావం వేసింది?''

''దుఃఖాన్ని! భరించలేని దుఃఖాన్ని నింపివేసింది. మస్తిష్కం ఆలోచనారహితమైపోయిందంటే నమ్మండి. గుండెలో అగ్నిపర్వతాలు బ్రద్దలైనా, వాటిని వ్యక్తం జెయ్యకుండా పైకి చిరునవ్వు నవ్వడం నా అలవాటు'' అన్నాడు తీర్థనాథ్.

సాలోచనగా తలూపి ''మీ అక్కయ్య ఇప్పుడు ఇంట్లో ఉండి ఉంటారా?'' అడిగేను.

తీర్థనాథ్ తలూపేడు.

''నేను వెంటనే ఆమెని కలుసుకోవాలనుకుంటున్నాను. మీరు నావెంట వస్తారా?''

అతను కాసేపు ఆలోచించి, ''సరే పదండి!''అన్నాడు.

అంబులెన్స్‌నీ, ఫోటోగ్రాఫర్లనీ పిలిపించి, అక్కడి తతంగం ముగించి, హెడ్ క్వార్టర్స్‌కి వెళ్ళిపొమ్మని డేవిడ్‌తో చెప్పి, తీర్థనాథ్ వెంట అతని కారువైపు నడిచేను.

3

పోర్టికోలో కారు ఆపేడు తీర్థనాథ్.

పాతకాలపు పద్ధతిలో కట్టబడిన మేడ అది.

కారు దిగి లోనికెళ్ళాం. హాల్లోంచి మెట్లగుండా మేడ మీదికి జేరుకున్నాం. రెండు మూడు గదులున్నాయి. అందులో ఓ గది తలుపు మూసి వుంది.

తీర్థనాథ్ ఆ గదిముందు నిల్చుని ''అక్కయ్యా!'' అని పిలిచేడు.

లోపలినించి జవాబులేదు.

"అక్కయ్యా!" మళ్ళీ పిలిచేడు తీర్థనాథ్.

నిశ్శబ్దం! అసలు గదిలో ఎవ్వరూ ఉన్న అలికిడి లేదు. తీర్థనాథ్ తలుపు తట్టడానికి చెయ్యి వెయ్యగానే, కిర్రు మంటూ తెరుచుకుంది రెక్క!

తలుపు పూర్తిగా తోసి లోనికెళ్లాడు తీర్థనాథ్. నేను బైటే నిల్చున్నాను. అంతే! కెవ్వున గావుకేక వినిపించింది లోపలినించి.

అది తీర్థనాథ్ గొంతు.

ఒక్క ఉదుటున లోనికి దూరేను.

గదిలోని దృశ్యం చూడగానే నా రోమాలు నిక్క బొడుచుకున్నాయి. గోడవారగా వేసి వున్న పందిరి మంచం, మంచంమీద వెల్లికిలా పడున్న, పుష్టికరమైన, అందమైన యువతి శవం.

అది కళ్ళు లేని శవం!

విచిత్రం ఏమిటంటే, ఆమె పూర్తి నవ వధువు దుస్తుల్లో వుండటం. నుదుట కుంకుమ తిలకం, కాళ్ళకి పసుపూ పారాణీ, ఒంటిమీద నగలూ!

"మా అక్కయ్య రత్నరాశి ఆమే!" అన్నాడు తీర్థనాథ్ పూడుకుపోయిన కంఠంతో.

అతన్ని ఉరిమి చూస్తూ జేబులోంచి పిస్తోలు తీసేను.

"ఇన్‌స్పెక్టర్! ఏమిటిది?" అడిగేడు తీర్థనాథ్ ఆశ్చర్యంగా.

"మిస్టర్ తీర్థనాథ్! నీ అక్క, నెలసరి జీతంమీద నీ దగ్గిర పనిజేసే ప్రసాదరావుని ప్రేమించి పెళ్ళిజేసుకోవా లనుకుంది. అది ఇష్టంలేక, నయానో భయానో వాళ్ళిద్దరికీ నచ్చజెప్పి ఉంటావ్.

వయసులో నీకంటే పెద్దదైన రత్నరాశి, నిన్ను ప్రేమించి వుంటుంది. ఎవ్వరి ప్రమేయం లేకుండా తనకి తానే, ప్రసాదరావుని పెళ్ళిజేసుకోడానికి నిశ్చయించి ఉంటుంది. ఆ కోపం భరించలేక ఇద్దర్నీ చంపివుంటావ్. నగరంలో ఈమధ్య ఇద్దరు యువతుల హత్యలు జరిగేయి. గుర్తు తెలియని హంతకుడు వాళ్ళని చంపి, శవాల కళ్ళు పీక్కుపోతున్నాడు. ఈ హత్యలూ ఆ అనామక హంతకుడే జేసినట్టు మమ్మల్ని తప్పుదోవ పట్టించడానికి, ఈ యెత్తు వేసివుంటావ్. నిన్ను ఈ క్షణంలో అరెస్ట్ జేస్తున్నాను'' అన్నాను తీక్షణంగా. నా మాటలుగానీ, నా చేతిలోని పిస్తోలుగానీ, అతనిమీద ఎలాటి ప్రభావం వెయ్యలేదు.

''ఇన్‌స్పెక్టర్ మీరు పొరబడుతున్నారు. నాకీ హత్యలతో ఎలాటి సంబంధం లేదు. నేను అక్కయ్యని రెండు రోజుల క్రితం కలుసుకున్నాను. ఆమె ప్రసాదరావుని పెళ్ళిజేసుకోవాలనుకున్నా, ఏ పాపారావుని పెళ్ళిజేసుకోవాలనుకున్నా నా కెలాటి అభ్యంతరం లేదు.

కారణం, ఒకరి వ్యక్తిగత విషయాలలో నే నెప్పుడూ జోక్యం కల్పించుకోను. అలాగే, నా స్వంత విషయాలలో మరొకరి జోక్యాన్ని సహించను'' అని క్షణం ఆగి, నిట్టూరుస్తూ తిరిగి చెప్పసాగేడు.

''ఇప్పుడర్థమౌతోంది ఈ హత్యలు ఎందుకు జరిగేయో, ఎవ్వరు జేసి వుంటారో?'' అన్నాడు తీర్థనాథ్.

''ఎవ్వరు జేసివుంటారు? రత్నరాశిని ప్రేమించే వ్యక్తి ఇంకెవ్వరైనా ఉన్నాడా? ఆమె ప్రసాదరావుని పెళ్ళి జేసుకోడం ఇష్టంలేక, ఆమెకి తనమీద ఇష్టంలేదు గనుక,

కసితో ఇద్దర్నీ చంపేసేడా?'' అన్నాను అతన్ని పరీక్షగా చూస్తూ.

తీర్థనాథ్ తలూపేడు. "నాలాగే మీరూ సరిగ్గా ఊహించేరు ఇన్‌స్పెక్టర్! అక్కయ్యని ప్రేమించే మరో వ్యక్తి వున్నాడు. కేవలం ప్రేమించడం కాదు. పిచ్చిగా ఆరాధించేవాడు. ఒకసారి నాతో చెప్పేడు కూడా, అక్కయ్యని తను పెళ్ళిజేసుకుంటాననీ.''

"ఎవ్వరతను?''

"జీవన్! అతనెవ్వరో పరాయివాడు కాదు. వేలు విడిచిన మా మేనత్త కొడుకే!''

"ఇప్పుడెక్కడున్నాడు?''

"నా ఇంట్లోనే! వాళ్ళకి హైద్రాబాద్‌లో బట్టల వ్యాపారం వుంది. పనిమీద అప్పుడప్పుడూ మద్రాసు వస్తుంటాడు. వచ్చినప్పుడల్లా నా ఇంట్లోనే మకాం జేస్తాడు.''

నేను ఇంకేమీ అడగలేదు. గదిమూలవున్న టెలిఫోన్ని సమీపించి, తాంబరం పోలీసులకి రింగ్ జేసి, కావలసిన సిబ్బందితో తక్షణం ఆ ఇంటికి రమ్మని చెప్పేను.

తరవాత తీర్థనాథ్ వైపు తిరిగి, "మిస్టర్ తీర్థనాథ్ నేను వెంటనే జీవన్‌ని చూడాలనుకుంటున్నాను''అంటూ పిస్తోలు జేబులో వేసుకున్నాను.

తీర్థనాథ్ తలూపేడు.

పావుగంట తరవాత తాంబరం పోలీసులు వచ్చేరు.

వాళ్ళకి కావలసిన ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి, తీర్థనాథ్‌తో బైలుదేరేను.

4

తన ఇంటి పోర్టికోలో కారు ఆపేడు త్రినాథ్.

మెట్లు తుడుస్తున్న నౌఖర్ని పిలిచి, "జీవన్ వున్నాడా ఇంట్లో?" అడిగేడు.

"అరగంట క్రితమే బైటనించి వచ్చేరండి. ఆరి గది లోనే వుండివుంటారు" అన్నాడు నౌఖరు.

తీర్థనాథ్ నావైపు తిరిగి, "రండి ఇన్స్పెక్టర్!" అన్నాడు.

అతన్ని అనుసరిస్తూ హాల్లో అడుగుపెట్టి, మెట్లగుండా పైకి జేరుకున్నాను. తలుపు తెరిచివున్న ఓ గదిలోకి నడుస్తూ, "రండి ఇన్స్పెక్టర్!" అన్నాడు తీర్థనాథ్.

అతని వెనకే గదిలో అడుగుపెట్టేను.

లోపల ఎవ్వరూ లేరు!

కాని, టీపాయ్‌మీది ఏష్ట్రేలో కాలుతున్న సిగరెట్ పీక కనిపించింది.

"బాత్‌రూం వెళ్ళుంటాడు. కూర్చోండి!" అన్నాడు తీర్థనాథ్.

ఐదు నిమిషాలు ఓపిగ్గా కూర్చున్నాం. ఏష్ట్రేమీది సిగరెట్ కూడా ఆరిపోయింది. కాని, ఎవ్వరూ రాలేదు.

బాత్‌రూం తలుపు మూసివుంది. లోపల నీళ్ళ శబ్దం గానీ, మరేశబ్దంగానీ వినిపించడంలేదు.

"ఇంతసేపూ ఏంజేస్తున్నాడబ్బా?" అంటూ బాత్ రూం వైపు నడిచేడు తీర్థనాథ్.

బాత్‌రూం తలుపు దగ్గిర ఆగి, "జీవన్!" అంటూ తలుపు తట్టేడు.

అతని చెయ్యి పడగానే చిన్న శబ్దంజేస్తూ తలుపు

తెరుచుకుంది.

తీర్థనాథ్ లోనికెళ్ళి కెవ్వుమన్నాడు.

నా గుండె గుభిల్లుమంది. మెరుపులా అక్కడికి చేరుకున్నాను.

నేలమీద వెల్లికిలా పడుంది శవం! అందమైన, ఆకర్షణీయమైన యువకుడి శవం. కళ్ళు ఉండవలసినచోట రెండు గుంటలు. ఆ గుంటల్లోంచి ఉబికి, కణతలమీద ధారలుగా కారిన రక్తం! గంట క్రింత సజీవంగా ఉన్న వ్యక్తి ఇతనేనా అనిపించింది. బాత్ రూంలోంచి పెరట్లోకి మరో తలుపుంది. అది దగ్గరగా వేసుంది.

తీర్థనాథ్ ని భుజం పట్టుకుని బైటికి తీసికెళ్ళేను. అతను ఎక్సైట్ మెంట్ కి గురయ్యేడు. ఫిట్స్ వచ్చినట్టు వణుకుతున్నాడు. ఈ మూడు హత్యలతో అతనికి సంబంధం లేదని తేలిపోయింది. కారణం, అరగంట క్రితం జీవన్ బైటినించి ఇంటికి వచ్చినట్టు చెప్పేడు నౌఖరు. కాని, తీర్థనాథ్ రెండు గంటలనించీ నా వెంటే వున్నాడు.

"మిస్టర్ తీర్థనాథ్! ఎక్సైట్ మెంట్ కి గురి కాకండి. ఈ సమయాల్లోనే ధైర్యం అవసరం. ఆ నౌఖర్ని పిలిపించండి" అన్నాను.

అతను వెళ్ళి అంత క్రితం పోర్టికోలో మాట్లాడిన నౌఖర్ని పిలుచుకొచ్చేడు.

"జీవన్ ఇంటికి వచ్చేక ఎలా కనిపించేడు?" అడిగేను.

"ఏదో తొందరలో వున్నట్టూ, ఖంగారుగా వున్నట్టూ పించేరండి. గేటు దగ్గర టాక్సీ దిగగానే హడావుడిగా లోనికి వచ్చి తన గదిలో కెళ్ళిపోయేరండి."

"అతను ఇంటికి వచ్చేక, ఎవ్వరైనా అతనికోసం

వచ్చేరా?"

"లేదండి. ఆయన రాకముందు మాత్రం సరసమ్మగోరు వచ్చి తీర్థనాథ్ గారు వున్నారా? అనడిగేరండి. కార్లో బైటికెళ్లేరని చెప్పేసండి. వారొచ్చేవరకూ డ్రాయింగ్ రూంలో కూర్చుంటానని లోనికెళ్ళేరండి" అన్నాడు నౌఖరు.

తీర్థనాథ్ వైపు తిరిగి, "సరస ఎవ్వరు?" అడిగేను.

"నా స్నేహితురాలు! పీపుల్స్ కాలేజ్‌లో లెక్చరర్‌గా పనిజేస్తోంది."

"జీవన్ వచ్చేవరకూ ఆమె ఇక్కడే వుందా?" అడిగేను నౌఖర్ని.

"తెలీదండి. నేను వేరే పనిమీదెళ్ళి తిరిగొచ్చి చూస్తే, డ్రాయింగ్ రూంలో ఆవిడ కనిపించలేదండి."

అతన్ని వెళ్ళమన్నట్టు సైగజేసి, "మిస్టర్ తీర్థనాథ్! మీకూ, సరసకూ ఎప్పటినించి స్నేహం?" అడిగేను.

"చాలా రోజులనించి. మేమిద్దరం ప్రేమించుకున్నాం! అక్కయ్య పెళ్ళవగానే ఆమెని పెళ్ళి జేసుకోవాలనుకున్నాను."

"ఆమె ఎక్కడుంటుంది?"

"ధనలక్ష్మి కాలనీ, 3-1-146 నెంబర్ ఇంట్లో."

"ఆల్‌రైట్! నే వెళ్ళి ఆమెని కలుసుకుంటాను. మీరిక్కడే వుండి పోలీసుల్ని పిలిపించి, శవాన్ని వాళ్ళకప్పగించండి" అన్నాను.

తీర్థనాథ్ తలూపేడు.

5

ధనలక్ష్మి కాలనీలో సరస ఇల్లు కనుక్కోడం ఏమంత కష్టం కాలేదు. తలుపు మూసివుంది. గడపకి వున్న

కాలింగ్ బటన్ నొక్కేను.

రెండునిమిషాల తరవాత తలుపు తెరుచుకుంది.

ఆమెని చూడగానే అనుకున్నాను. తీర్థనాథ్, అందాన్ని అంచనా వెయ్యడంలో మంచి ప్రావీణ్యం కల వాడని.

"మిస్ సరస మీరే కదూ?" అడిగేను.

ఆమె తలూపి, ప్రశ్నార్థకంగా చూసింది.

"అయామ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి ఫ్రం క్రయిం బ్రాంచ్!" అన్నాను. ఇన్‌స్పెక్టర్...క్రయిం బ్రాంచ్ అనగానే ఆమె బెదిరిపోయినట్టు కనిపించింది.

"నేను మీతో మాట్లాడాలని వచ్చేను" అన్నాను.

"రండి. లోనికి రండి" అంది వణికే కంఠంతో.

లోనికెళ్ళగానే, "కూర్చోండి" అంది సోఫాలు చూపిస్తూ.

"సరసాదేవీ! కొన్నిగంటల క్రితం మీరు తీర్థనాథ్ ఇంటికి వెళ్లేరు కదూ?" అడిగేను సోఫాలో కూర్చుని.

"ఔను. ఏం జరిగిందక్కడ?" అంది ఆతృతగా.

"చెబుతాను. ముందు నా ప్రశ్నకి జవాబివ్వండి. మీరక్కడ ఎంతసేపున్నారు?"

"ఎంతసేపున్నానో ఖచ్చితంగా చెప్పలేను. తీర్థనాథ్ కోసం వెళితే, లేడని చెప్పేడు నౌఖరు. కాసేపు కాచుకుందామని డ్రాయింగ్ రూంలో కూర్చున్నాను. ఎంతకీ వచ్చే సూచనలు కనిపించకపోతే, విసుగెత్తి వచ్చేశాను."

"జీవన్ తిరిగి వచ్చేవరకూ మీ రక్కడే వున్నారా?"

"లేదు. నే నతనికోసం వెళ్ళలేదు కదా? అతను ఇంట్లో వున్నాడో లేడో కూడా నాకు తెలియదు. ఇంతకీ

ఏం జరిగిందో మీరు చెప్పడంలేదు!"

"సరసాదేవీ! ఈ ఒక్కరోజులోనే ప్రసాదరావ్, రత్నరాశీ, జీవన్ ముగ్గురూ చంపబడ్డారు" అన్నాను ఆమెని పరీక్షగా చూస్తూ.

ఆ వార్త వినగానే సరస కంఠంనించి చిన్న కేక బైటికి వచ్చింది. ఇంకా ఏదో అనబోయేను. సరిగ్గా అప్పుడే టెలిఫోన్ గణగణ మోగింది.

సరస లేచివెళ్ళి, ఫోన్ విని, "మీకు!" అంది.

లేచి రిసీవర్ అందుకున్నాను.

"సార్జంట్ డేవిడ్ స్పీకింగ్!" వినిపించింది అవతలి నించి.

"నువ్వా? నేనిక్కడున్నానని ఎలా తెలిసింది?" అడిగేను.

"మీరు తీర్థనాథ్ వెంట వెళ్ళేరు కదా, అక్కడే వుండి వుంటారని అక్కడికి ఫోన్ జేసేను. ధనలక్ష్మీ కాలనీలో ఓ ఇంటికి వెళ్ళేరని ఆ ఇంటి ఫోన్ నెంబర్ చెప్పేడు" అన్నాడు డేవిడ్.

"ఏమిటి?"

"మరో హత్య జరిగింది."

"ఎక్కడ?" అడిగేను ఆశ్చర్యంగా.

"మెరీనా బీచి సమీపాన వున్న కొబ్బరితోటలో పడుంది శవం!"

"స్త్రీయా? పురుషుడా?"

"స్త్రీ!"

"శవానికి కళ్ళున్నాయా?"

"లేవు!"

"నీవు ఎక్కణ్ణించి మాట్లాడుతున్నావ్?"

"పబ్లిక్ టెలిఫోన్ బూత్ నించి."

"ఇప్పుడే వస్తున్నాను. అక్కడే వుండు" అని రిసీవర్ దించి సరసవేపు తిరిగేను. "మీరు మా అనుమతి లేకుండా ఎక్కడికీ వెళ్ళవద్దు. ఏ క్షణంలోనైనా వచ్చి మిమ్మల్ని కలుసుకుంటాను" అని బైటికి నడిచేను.

6

తోటలో డేవిడ్‌తో బాటు, ఆ ఏరియా పోలీస్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్స్ కూడా వున్నారు.

అది బీచికి దగ్గర్లో అందంగా పెంచిన తోట గనక అప్పుడప్పుడు బైటివాళ్ళుకూడా అక్కడికి షికారుకువస్తూ పోతుంటారు. డేవిడ్ నన్ను శవంవున్న చోటికి తీసికెళ్లేడు.

ఓ పొదల గుబురుదగ్గిర వెల్లకిలా పడుంది. ముప్పై ఏళ్ళుంటాయి ఆమెకి. ఎర్రగా, బొద్దుగా వుంది. ఉంగరాల జుత్తు. విచిత్రం ఏమిటంటే, వెనకటి శవాలలా కాక, ఇది నగ్నమైన శవం!

శవానికి కొద్దిదూరంలో పడున్నాయి బట్టలు. అవి ఉన్న తీరు చూస్తుంటే, హతురాలు తనకి తానే ఒంటిమీది బట్టలు ఒలిచి మడతపెట్టి అక్కడ పెట్టివుంటుందని తోస్తోంది. శవంమీద ఎలాటి గాయాలు లేవు.

దీన్నిబట్టి హంతకుడు ఈసారి హత్య జెయ్యకముందు హతురాలిని అనుభవించేడని స్పష్టమౌతోంది.

సాలోచనగా తలూపి, "శవం ఇక్కడుందని మీకు ఇన్ఫర్మేషన్ ఎవరిచ్చేరు?" అడిగేను డేవిడ్‌ని.

"తోటమాలి తొమ్మిదిగంటల ప్రాంతంలో క్రోటన్స్ కట్ జేస్తూ ఇటువైపు వచ్చేడుట. శవం కనిపించగానే,

పరిగెత్తి పోలీస్ స్టేషన్‌లో చెప్పేడుట. ముఖ్యవిషయం ఏమిటంటే, నిన్న సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో ఈ స్త్రీ ఎవ్వరో మగాడివెంట తోటలోకి రావడం తోటమాలి చూసేడు'' అన్నాడు డేవిడ్.

''ఆ తోటమాలి ఎక్కడ?''

రెండు నిమిషాల తరవాత తోటమాలి హాజరయ్యేడు. ''ఈ స్త్రీ నిన్న సాయంత్రం ఓ వ్యక్తివెంట యిక్కడికి వచ్చినట్టు చెప్పేవుట. ఆ వ్యక్తి ఎలా వుంటాడు?'' అడిగేను.

''సూటూ బూటులో ఎర్రగా, పొడుగ్గా వున్నాడు బాబూ! కళ్ళకి నల్లజోడు పెట్టుకున్నాడు' చేతికర్ర పట్టుకుని కాస్త ఊంటుకుంటూ నడుస్తాడు.

చీకటి పడేవేళ అళ్ళిద్దరూ గేటుగుండా తోటలోకి రావడం చూసేను. భార్యాభర్తలై వుంటారనీ, షికారుకి వచ్చివుంటారనీ అనుకున్నాను'' అన్నాడు తోటమాలి.

''ఆ వ్యక్తికి సుమారు ఎన్నేళ్ళుంటాయి?''

''ముప్పై, ముప్పై ఐదేళ్ళుంటాయి బాబూ!''

''అతని వెంటున్నప్పుడు ఈ స్త్రీ భయపడుతున్నట్టు కనిపించిందా?''

''లేదు బాబూ! ఇద్దరూ నవ్వుకుంటూ, ఖలాసాగా కబుర్లాడుకుంటూ వచ్చేరు!''

''తిరిగి అతను బైటికెళ్ళడం నువ్వు చూశేదా?''

''చూశేదు బాబూ! అళ్ళు లోనికి రాగానే, నేను పనిమీద బజారెళ్ళేను. తిరిగొచ్చి చూస్తే ఇద్దరూ కనిపించలేదు. ఎల్లిపోనారనుకున్నాను.''

సాలోచనగా తలూపుతూ శవాన్ని సమీపించేను. ఆ

స్త్రీ ఎవ్వరో గుర్తించాలంటే ఒకేఒక ఆధారం బట్టలు! బట్టలమీద చాకలి గుర్తులద్వారా ఏదైనా తెలిసే అవకాశం వుంది.

బట్టల్ని జాగ్రత్తగా ఒక్కొక్కటే ఎత్తి చూసేను.

చాకలి గుర్తులు లేవు!

వాటిని కొత్తగా కుట్టించుకున్నట్టుంది. ఇంకా చాకలికి వెయ్యలేదు. పెదవి విరుస్తూ డేవిడ్‌ని చూసి, "అంబులెన్స్‌నీ, ఫోటోగ్రాఫర్లనీ పిలిపించి, క్లోజప్‌లో ఆమె ఫోటోలు తీయించాలి. ఆ ఫోటోలు రేపటి దినపత్రికల్లో ప్రకటించాలి. దాంతో ఈమెకి సంబంధించినవాళ్ళెవ్వరైనా వచ్చే అవకాశముంటుంది" అన్నాను.

డేవిడ్ తలూపేడు.

7

"మే ఐ కమిన్ సర్?" అన్న కంఠం విని,

ఫైలు చూస్తున్నవాణ్ణల్లా తలెత్తి, "ఎస్!" అన్నాను.

స్ప్రింగ్ డోర్స్ తెరుచుకున్నాయి.

తెల్ల పాంటూ, తెల్ల షర్టూ వేసుకున్న ఓ వ్యక్తి వచ్చేడు లోనికి.

అతని మొహంలో విషాదం స్పష్టంగా వ్యక్తమౌతోంది. అంతకుముందు అతన్ని యెక్కడా చూసిన గుర్తులేదు.

"ప్లీజ్, టేక్ యువర్ సీట్!" అన్నాను మర్యాదకి.

"నన్ను డాక్టర్ వివేకానంద్ అంటారు. ఈ రోజు పత్రికల్లో ప్రకటించిన శవం ఫోటోలు నా భార్యవే!" అన్నాడతను కుర్చీలో కూర్చుంటూ.

"అది మీ భార్య శవమే అని ఖచ్చితంగా చెప్పగలరా?"

అతను తలూపి, "చెప్పగలను. మూడురోజుల క్రితం తన స్నేహితురాలి యింటికి వెళ్తొస్తానని చెప్పి వెళ్ళింది. అప్పుడు ఉదయం ఎనిమిదిగంట లవుతుం దనుకుంటాను. రాత్రి ఎనిమిది గంటలవరకూ ఎదురుచూసేను. రాలేదు.

దురదృష్టవశాత్తు ఆమె స్నేహితురాలి ఇల్లెక్కడో నాకు తెలీదు. అందుకే కనుక్కోలేకపోయేను. మర్నాటి మధ్యాహ్నంవరకూ ఎదురుచూసి, ఏదో జరిగివుంటుందని, స్థానిక పోలీసులకి రిపోర్ట్ ఇచ్చేను. ఈరోజు న్యూస్ పేపర్ చూసేక తెలిసింది, నా భార్య హత్య చెయ్యబడిందని" అన్నాడు.

"ఆమె పేరేమిటి?"

"ఉపేక్ష!"

"మీ వివాహమై ఎన్నాళ్ళయింది?"

"ఇది రెండో సంవత్సరం! ఎంతో అన్యోన్యంగా వుండేవాళ్ళం. ఇటువంటి ఘోరం జరుగుతుందని ఎన్నడూ ఊహించలేదు" అన్నాడతను పూడుకుపోయిన కంఠంతో.

"మీ భార్యకి ఆడస్నేహితులతోబాటు, మగ స్నేహితులుకూడా వుండేవారా?"

వివేకానంద్ తల విదిలించి, "నో!" అన్నాడు.

"బాగా ఆలోచించి చెప్పండి. ఇలా దేని కడుగుతున్నానంటే ఆమె హత్య జరిగినరోజు సాయంత్రం ఏడు గంటలకి ఓ వ్యక్తి వెంట, మెరీనా బీచి దగ్గర్లోవున్న కొబ్బరితోటలోకి వెళ్ళినట్టు మా దగ్గర సాక్ష్యం వుంది.

ఆమె వెంటవున్న వ్యక్తి పొడుగ్గా, ఎర్రగా వుంటాడు. చేతిలో స్టిక్ పట్టుకుని కాస్త కుంటుతూ నడుస్తాడు. మీకు గానీ, మీ భార్యకి గానీ అటువంటి పోలికలు గల

ఏ వ్యక్తితోనైనా పరిచయముందేమో బాగా ఆలోచించి చెప్పండి."

వివేకానంద్ కాసేపు ఆలోచించి, "నో! ఎవరూ లేరు!" అన్నాడు.

"నా ఈ చివరి ప్రశ్నకి మీరు సూటిగా జవాబివ్వాలి. మీ భార్య ఆ వ్యక్తి వెంట ఆ తోటలోకి తనకు తానుగా వెళ్ళింది. ఆమె శవం అక్కడ నగ్నంగా దొరికింది. ఎవ్వరి బలాత్కారం లేకుండా ఆమె తనంతట తాను బట్టలు విడిచినట్టు నా అంచనా! ఈ ఆధారంతోనే ఈ ప్రశ్న అడుగుతున్నాను. ఆమె క్యారెక్టర్ ఎటువంటిది?" అడిగేను అతని కళ్ళల్లోకి చూస్తూ.

సిగ్గుతోనో, కోపంతోనో అతని మొహం ఎర్రబడింది. కాసేపు ఆలోచించి అన్నాడు. "ఇన్‌స్పెక్టర్! నాకు తెలిసినంతవరకూ ఉపేక్షకు మత్తుమందులు వాడే అలవాటు తప్ప మరే దురలవాటూ లేదు."

ఆ జవాబుతో నా బుర్ర తీవ్రంగా పనిజెయ్యసాగింది.

"ఆమెకి మత్తుమందులు వాడే అలవాటుందేదా? ఏయే మందులు వాడేది?" అడిగేను ఆత్రతగా.

"ఒకసారి ఉపేక్షకి తీవ్రంగా జ్వరం వచ్చింది. రాత్రంతా నిదరపట్టక మూలుగుతుంటే, పెథడిన్ ఇంజక్షన్ యిచ్చేను. ఆ ఇంజక్షన్ యిస్తే పేషెంట్ తాత్కాలికంగా బాధమరిచి నిదరపోతాడు. సాధారణంగా ఆ ఇంజెక్షన్ని ఆడవాళ్ళు ప్రసవించే సమయాల్లో వాడతారు.

ఉపేక్షకి ఆ ఇంజెక్షన్ యిచ్చేక, ఆ రాత్రి సుఖంగా నిదరపోయింది. మర్నాడు తనే కోరింది ఆ ఇంజెక్షన్ యివ్వమనీ, బాగా నిదర పడుతుందనీ యిచ్చేను. మూడో

రాత్రి అడిగింది. ఇచ్చేను. అంతే!

ఉపేక్ష దానికి దాసురాలైపోయింది. ఆ ఇంజక్షన్ రుచి మరిగిన వ్యక్తి జీవితం నరకప్రాయమై పోతుంది. అందుకే, నేను భయపడి, అది తీసుకోవద్దనీ, దానివల్ల అనేక నష్టాలు కలుగుతాయనీ ఉపేక్షకి లక్షసార్లు చెప్పేను.

వినలేదు. మా ఇంట్లోనే నా డిస్పెన్సరీ వుంది. ఉపేక్ష నా కళ్ళు గప్పి పిల్లిలా డిస్పెన్సరీలోంచి ఆ ఇంజెక్షన్స్ కాజెయ్యసాగింది. అది పసిగట్టి ఆమె కవి అందుబాటులో వుండకుండా డిస్పెన్సరీనించే తీసివేసేను.

దాంతో ఉపేక్ష మెడికల్ షాప్స్ శరణుజొచ్చింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేనిదే ఆ ఇంజక్షన్ అమ్మడం చట్ట రీత్యా నేరం! ఐనా, మెడికల్ షాప్ వాళ్ళు తమ స్వార్థం కొద్దీ, అడిగినవాళ్ళకి, డాక్టర్ చీటీ లేకున్నా, రెట్టింపు ధరకి అమ్ముతుంటారు.

ఉపేక్ష ఆ విధంగా సంపాదించేది వాటిని. సిరెంజిలో మందు ఎక్కించి తనకి తానే ఇంజక్షన్ తీసుకునేది. బజార్లో ఆ ఇంజక్షన్ స్టాక్ ఐపోతే, దొరక్కపోతే, లిపిటన్, మార్ఫిన్, నల్లమందువంటి మత్తుపదార్థాలు వాడేది.

ఆమెని ఆ దురలవాట్లనించి మళ్ళించడానికి అనేక ప్రయత్నాలు జేసేను. ఈ మధ్యే కొద్దిగా దారికి వచ్చి నట్టు కనిపించింది'' అన్నాడు డాక్టర్ వివేకానంద్.

నాలో మెరుపులా ఓ ఆలోచన తళుక్కుమంది. ఉపేక్షలాగే హత్యజెయ్యబడ్డ మిగతావాళ్లూ అటువంటి మత్తుపదార్థాలు వాడేవారా? హంతకుడు వాళ్ళ ఆ బలహీనతను తన స్వప్రయోజనానికి ఉపయోగించు

కుంటున్నాడా?

కనుక్కోవాలి. వెంటనే ఈ విషయం కనుక్కోవాలి.

"ఆల్ రైట్ డాక్టర్! మీరు మీ భార్య శవాన్ని తీసి కెళ్ళవచ్చు. అవసరం కలిగితే మళ్ళీ మిమ్మల్ని కలుసు కుంటాను" అని సార్జంట్ దేవిడ్‌ని పిలిచి శవాన్ని అతని కప్పగించవలసిందిగా ఆదేశించేను.

వివేకానంద్ సార్జంట్ వెంట వెళ్ళిపోయేడు.

ఆఫీసులోంచి బైటపడి, జీప్ ఎక్కి, తీర్థనాథ్ ఇంటికి బైలుదేరేను.

8

"మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి" అన్నాను తీర్థనాథ్‌తో.

"చెప్పండి!" అన్నాడు.

"హత్య చెయ్యబడ్డ మీ సెక్రెటరీ ప్రసాదరావ్‌కి ఏవైనా మత్తుమందుకు తీసుకునే అలవాటుండేదా? బాగా ఆలోచించి చెప్పండి!" అన్నాను సిగరెట్ అంటించి.

తీర్థనాథ్ కాసేపు ఆలోచించి, "స్పష్టంగా చెప్పలేను. కాని, ఒకటి రెండుసార్లు ప్రసాదరావ్, నాకు దగ్గరగా నిల్చుని మాట్లాడినప్పుడు అతని నోటినించి అదోరకం వాసన వేసింది.

ఏమిటని అడిగితే, తన నోట్లో అప్పుడప్పుడూ గమ్ బాయిల్ (పంటి చిగుళ్ళు ఉబ్బే జబ్బు) వస్తుందనీ, అది తగ్గడానికి మందు వాడతాననీ చెప్పేవాడు. అంతే నాకు తెలిసింది" అన్నాడు.

"సరే, మీ బంధువు జీవన్‌కికూడా అటువంటి అలవా టేదైనా వుండేదా?" అడిగేను.

తీర్థనాథ్ కాసేపు ఆలోచించి, "ఇదీ సరిగ్గా చెప్ప లేను. కారణం, ఆ దృష్టితో నే నెప్పుడూ వాళ్ళని చూడ లేదు. ఒకరి గురించి అంతగా పట్టించుకునే తీరికా నాకు లేదు" అన్నాడు.

"చివరి ప్రశ్న. చాలా ముఖ్యమైన ప్రశ్న యిది. ప్రసాదరావ్‌లాగే మీ అక్కయ్యకూడా అటువంటి మత్తుమందులు వాడుతుందని ఎప్పుడైనా అనుమానం వేసిందా మీకు?"

"అక్కయ్యా, నేనూ ఏ రెండురోజులకో ఒకసారి కలుసుకునేవాళ్ళం. అదీ కొద్ది నిమిషాలే. ఆమెకి డబ్బు అవసరమైతే ఇక్కడికి వచ్చి తీసికెళ్ళేది. ఆమెని చూడా లనుకున్నప్పుడు నేనే ఆమెదగ్గరి కెళ్ళేవాణ్ణి. అక్కయ్య స్వంత విషయాలు నాకన్నా సరసకే బాగా తెలుసు" అన్నాడు తీర్థనాథ్.

"వాళ్ళమధ్య అంత స్నేహం వుండేదా?" అడిగేను ఆశ్చర్యంగా.

తీర్థనాథ్ నవ్వి, "అక్కయ్య ద్వారానే సరస నాకు పరిచయమైంది. వాళ్ళది చాలా పాత స్నేహం!" అన్నాడు.

"ఐతే, సరసకి ఫోన్ జేసి వెంటనే యిక్కడికి రమ్మ నండి."

తీర్థనాథ్ తలూపి, ఫోన్ దగ్గరి కెళ్ళేడు.

అరగంట తరవాత టాక్సీలో వచ్చింది సరస.

నన్ను చూడగానే ఆమె కళ్ళల్లో భయం కనిపించింది. ఆమె భయాన్ని దూరం జెయ్యడానికి చిరునవ్వు నవ్వేను.

"ఇన్‌స్పెక్టర్ గారు నీతో ఏదో మాట్లాడాలిట. అందుకే ఫోన్ జేశాను" అని నావైపు తిరిగి, "మీరిద్దరూ

మాట్లాడుతుండండి. నేనిప్పుడే వస్తాను" అంటూ బైటికి నడిచేడు తీర్థనాథ్.

"కూర్చోండి" అన్నాను సరసని.

బెదురుతూ కూర్చుంది సోఫాలో.

సిగరెట్ అంటించి చాలా నింపాదిగా అడిగేను. "సరసాదేవి! మీకూ, రత్నరాశికీ మధ్య మంచి స్నేహం వుండేదని తెలిసింది. నిజమేనా?"

సరస తలూపి, "మే మిద్దరం ఆదర్శ మహిళామండలి సభ్యులం. ఏడాది క్రితం అక్కడే రత్నరాశితో నాకు పరిచయమైంది. ఆ పరిచయమే స్నేహంగా మారింది. తరుచూ ఇద్దరం కలుసుకునేవాళ్ళం!" అంది.

"ఐతే, ఆమె అలవాట్లూ, అభిరుచులతో మీరు బాగా పరిచితులై వుంటారనుకుంటాను?"

"ఔను!"

"ఆమెకి మత్తుపదార్థాలు వాడే అలవాటుండేదా?" హఠాత్తుగా వేసిన ఈ ప్రశ్నతో సరస మొహం పాలిపోయింది.

చెప్పడానికి తటపటాయిస్తున్నట్టు కనిపించింది.

"చెప్పండి!" అన్నాను రెట్టించి.

చివరికి "ఔను!" అంది.

"ఎలాటి పదార్థాలు వాడేది?"

"గుండ్రంగా, తెల్లగా వుండేవి ఆ బిళ్ళలు!"

"వాటి పేరేమిటి?"

"తెలీదు. కాని, రత్నరాశి ఆ బిళ్ళలు ఎక్కడ కొనేదో మాత్రం చెప్పగలను."

"ఎక్కడ కొనేది?"

"మూర్ మార్కెట్‌లో వున్న పార్కర్ మెడికల్ షాప్‌లో!"

"ఆ షాప్ పేరు మీ కెలా తెలుసు?"

"ఒక్కోసారి మే మిద్దరం కలిసి బజారుకో, సినిమాకో వెళ్ళేవాళ్ళం. అప్పుడు కొనడం చూసేను."

"అటువంటి అలవాటేదైనా మీకూ వుందా?"

సరస తల విదిలించి, "నో!" అంది.

"ఎప్పుడైనా రత్నరాశి మీకూ ఆ బిళ్ళలు తినమని ఇచ్చిందా?"

"ఔను! ఒకసారి అడిగేను, ఆ బిళ్ళలు దేనికి కొంటావూ? ఏదైనా జబ్బా? అని. అందుకు రత్నరాశి నవ్వి, ఓ బిళ్ళ నా చేతికిస్తూ వేసుకోమనీ, స్వర్గంలో వున్నట్టు అనుభూతి కలుగుతుందనీ చెప్పింది.

ఏమిటో చూద్దామని వేసుకున్నాను. అంతే! కాళ్ళూ, చేతులూ గాలిలో తేలిపోతున్నట్టూ, నింగీ - నేలా ఏక మౌతున్నట్టూ, మస్తిష్కం ఆలోచనారహితమై పోయి నట్టూ తోచింది. మొదటిసారి కనక, వాంతికూడా చేసు కున్నాను. అప్పటినించే అవంటే అసహ్యమేసింది.

అప్పుడు తెలిసింది, రత్నరాశి వాడే ఆ బిళ్ళలు జబ్బు కోసం కాదు, మత్తుకోసం వాడేవి అని! నీకీ అలవాటు ఎలా పడిందని అడిగితే, ప్రసాదరావ్ వల్ల అని చెప్పింది!"

"థాంక్స్ మిస్ సరసా! మీవల్ల ఎంతో విలువైన విషయాలు తెలిసేయి. ఇక మీరు వెళ్ళవచ్చు" అంటూ లేచాను.

తీర్థనాథ్ దగ్గర సెలవు తీసుకుని అక్కణ్ణించి బయలు దేరాను.

9

పార్కర్ మెడికల్ షాప్ ముందు జీప్ ఆపి దిగేను. చాలా పెద్ద షాప్ అది. నలుగురైదుగురు మగ సేల్స్ మెన్స్‌తోబాటు, సేల్స్ గర్ల్స్‌కూడా పనిజేస్తారక్కడ. మెడికల్ షాప్ పక్కనే పార్కర్ డిస్పెన్సరీ వుంది.

సాలోచనగా తలూపుతూ షాప్‌లోకి నడిచేను.

నన్ను చూడగానే, "చెప్పండి?" అన్నాడు ఓ సేల్స్‌మెన్.

నేను యూనిఫాంలో లేను గనక, పోలీస్ ఇన్‌స్పెక్టర్నని తెలిసే అవకాశం లేదు. క్రయింబ్రాంచివాళ్ళు సాధారణంగా యూనిఫాంలో వుండరు. "ఈ షాపు యజమానీ, లేదా మేనేజర్ని కలుసుకోవాలి" అన్నాను.

అతను ఎగాదిగా చూసి, "యజమాని ఎప్పుడో ఒకసారి వస్తారు. మేనేజర్ లోపల వున్నారు. కాని, వేరే పనిలో వున్నారు - బిజీగా. తనకోసం ఎవ్వరైనా వస్తే తరవాత రమ్మనమని యింతక్రితమే చెప్పేరు" అన్నాడు.

"అయామ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి ఫ్రం క్రయిం బ్రాంచ్. వెళ్ళి చెప్పండి. ఆయన్ని అర్జెంటుగా చూడాలి" అన్నాను అధికారపూర్వకంగా.

క్రయింబ్రాంచ్ అనగానే అతని ముఖం రంగులు మారింది.

మరేమీ మాట్లాడకుండా లోనికెళ్లేడు.

ఐదునిమిషాలు ఓపిగ్గా కాచుకున్నాను.

అతను తిరిగివచ్చి, "రండి!" అన్నాడు.

అతన్ని అనుసరిస్తూ, 'మేనేజర్' అని రాసివున్న గదిలోకెళ్లేను. నన్ను చూడగానే అతను కుర్చీలోంచి లేచి,

"గ్లాడ్ టు సీ యూ సర్! మీ గురించి చదవడమేకాని, ప్రత్యక్షంగా చూసే అవకాశం కలగలేదు. ప్లీజ్, టేక్ యువర్ సీట్. నా పేరు ప్రవీణ్ కుమార్!" అన్నాడు షేక్ హాండ్ ఇస్తూ.

కుర్చీలో కూర్చుంటూ అతన్ని పరీక్షగా చూసేను. ముప్పై, ముప్పై ఏడేళ్ళుంటాయి. ఎర్రగా, పొడుగ్గా వున్నాడు. ఉంగరాల జుత్తు, ఆఫ్ కలర్ సూటు వేసుకున్నాడు.

"మిస్టర్ ప్రవీణ్ కుమార్! మీ షాప్ లో పెథిడిన్, మార్ఫిన్ వంటి ఇంజెక్షన్లూ, లిపిటన్ వంటి టాబ్లెట్సూ అమ్ముతారా?" అడిగేను, అసలు విషయానికి వస్తూ.

అతను తలూపి, "ఔను. వాటిని అమ్మడానికి మా దగ్గర లైసెన్సు వుంది. ఇంతకీ, మా షాప్ మీద ఎవ్వరైనా కంప్లైంట్ యిచ్చేరా?" అడిగేడు ఆశ్చర్యంగా.

"చెబుతాను. ముందు ఆ డ్రగ్స్ ని అమ్మే సేల్స్ మెన్ని యిక్కడికి పిలిపించండి" అన్నాను జేబులోంచి సిగరెట్ తీస్తూ.

ప్రవీణ్ కుమార్ అక్కడే నిల్చున్న సేల్స్ మెన్ని చూసి, "స్వరూపని పిల్చుకురా!" అన్నాడు.

ఐదునిమిషాల తరవాత ఓ అందమైన యువతి వచ్చింది.

"డ్రగ్స్ అమ్మే కౌంటర్లో ఈమే పనిజేస్తుంది" అన్నాడు ప్రవీణ్ కుమార్.

"మీరా డ్రగ్స్ ని ఏ ప్రొసీజర్ మీద అమ్ముతారు?" అడిగేను ఆ అమ్మాయిని.

"డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేనిదే ఎట్టి పరిస్థితిలోనూ డ్రగ్స్ ఇవ్వను."

"ఏ ఐటమ్ ఏయే మోతాదులో అమ్ముతారు?"

"ఇంజెక్షన్ ఐతే రెండు, టాబ్లెట్స్ ఐతే నాలుగు!"

"డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేని కస్టమర్లుకూడా వస్తుంటారా?"

"వస్తుంటారు. కాని, ఎట్టి పరిస్థితిలోనూ వాళ్ళకి మందులివ్వను."

"అటువంటి కస్టమర్స్, రేటుకి రెండింతలిస్తామని ఆశ పెడుతుంటారా?"

"ఔను. ఐనా వాళ్ళకి నిర్మొహమాటంగా చెప్పేస్తాను ఇవ్వనని."

"థాంక్స్! ఇక మీరు వెళ్ళవచ్చు" అన్నాను.

ఆ యువతి వెళ్ళిపోగానే ప్రవీణ్ కుమార్ వైపు తిరిగి, "ఈ షాప్ ఓనర్ ఎవ్వరు?"

"శ్రీకాంత్ గారు."

"ఆయనెక్కడుంటారు?"

"తిరువాన్కూర్‌లో. నెలకోసారి ఇక్కడికి వచ్చి, కమర్షియల్ ఎకౌంట్స్ చూసి పోతుంటారు."

"అంటే, ఇక్కడి కార్యభారమంతా మీరే చూసుకుంటారన్నమాట."

ప్రవీణ్ కుమార్ తలూపేడు.

"మీ షాప్ కనుబంధంగా ఏదైనా డిస్పెన్సరీ వుందా?"

"ఉందిగా! మీరు చూసివుంటారు. షాప్ పక్కనే వుంది."

"ఆ డిస్పెన్సరీ ఎవరు నడుపుతారు?"

"అక్కడి ఏర్పాట్లుకూడా నేనే చూసుకుంటాను. డాక్టర్ భార్గవగారు మాత్రం ఉదయం రెండుగంటలూ,

సాయంత్రం రెండుగంటలూ వుండి, పేషెంట్స్‌ని చూసి పోతారు.''

''ఆయనిప్పుడు డిస్పెన్సరీలో వున్నారా?''

ప్రవీణ్‌కుమార్ టైం చూసి, ''నో! ఇంటిదగ్గర వుండి వుంటారు'' అన్నాడు.

''ఐ వాంట్ టు సీ హిమ్! ప్లీజ్, ఆయనకి ఫోన్ జేసి వెంటనే యిక్కడికి రమ్మని చెప్పండి!''

''ఇంతకీ మీ రివన్నీ దేని కడుగుతున్నారో చెప్పనే లేదు'' అన్నాడు ప్రవీణ్‌కుమార్ ఆశ్చర్యంగా.

నవ్వేను. ''మిస్టర్ ప్రవీణ్‌కుమార్! గత కొద్ది రోజుల్నించీ నగరంలో విచిత్రమైన హత్యలు జరుగుతున్నాయి. దాదాపు హతులందరూ మత్తుపదార్థాలకి అలవాటుపడ్డ వారేనని తేలింది. అంతేకాదు, ఆ డ్రగ్స్‌ని వాళ్ళు 'మీ షాప్‌నించే కొనేవారని మా దగ్గర ప్రత్యక్ష సాక్ష్యం వుంది'' అంటూ అతని ముఖంలోకి చూసేను.

అతనిలో భయంగానీ, ఖంగారుగానీ కనిపించక పోడంతో కాస్త ఆశ్చర్యం వేసింది.

కాసేపు మౌనంగా వుండి అన్నాడు ప్రవీణ్‌కుమార్. ''ఆల్‌రైట్. మీ పరిశోధనేదో మీరు జేసుకోండి. ఈ విషయంలో మీతో సహకరించడం, ఒక పౌరుడిగా నా ధర్మం'' అని టేబిల్‌మీది టెలిఫోన్ దగ్గరికి లాక్కున్నాడు.

ఓ నెంబర్ రింగ్ జేసి, కాసేపు మాట్లాడి, ''డాక్టర్ భార్గవ వస్తున్నారు!'' అన్నాడు.

అరగంట తరవాత, ఫుల్‌సూటులో వున్న వ్యక్తి గది లోకి ప్రవేశించేడు.

10

“వీరే డాక్టర్ భార్గవ!” అన్నాడు ప్రవీణ్ కుమార్.

ఏ యాభైఏళ్ళ ముసలివాడో అనుకున్న నేను, డాక్టర్ భార్గవని చూడగానే కాస్త ఆశ్చర్యపోయేను. కారణం, అతనికి దాదాపు ముప్పై ఐదేళ్ళుంటాయి. తెల్లగా, పొడుగ్గా వున్నాడు. పక్కపాపిడి తీసి దువ్వుకున్న జుత్తు. ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టుండే చురుకైన కళ్ళు.

“చెప్పండి ఇన్‌స్పెక్టర్! నన్ను దేనికి పిలిపించేరు?” అన్నాడు భార్గవ కుర్చీలో కూర్చుంటూ.

“కేవలం కొన్ని ప్రశ్నలడగడానికి!” అన్నాను సిగరెట్ తీస్తూ.

“అడగండి!” అన్నాడు భార్గవ నింపాదిగా.

“నా మొదటి ప్రశ్న ఇది. నిన్న సాయంత్రం ఆరు గంటలకి మీ రెక్కడున్నారు?” సూటిగా వదిలేను బాణం.

అతనుకూడా తొణక్కుండా, బెణక్కుండా జవాబిచ్చేడు చాలా గంభీరంగా. “రోజూ సాయంత్రం ఏడు గంటలకి, ఇక్కడికి వచ్చి పేషెంట్స్‌ని చూస్తాను. అంటే, ఇంటినించి ఆరున్నరకి బైలుదేరతానన్నమాట!”

“మీ దగ్గరికి వచ్చే పేషెంట్స్‌లో యెవరికైనా, పెథడిన్, మార్ఫిన్ వంటి ఇంజెక్షన్స్‌కోసం రెకమెండ్ జేస్తారా మీరు?”

“ఔను. గేస్ ట్రబుల్, లేదా అపెండిసాయిట్ వంటి రోగులు ఒక్కోసారి నెప్పి భరించలేక, రాత్రుళ్ళు నిదర పట్టక నానాఅవస్థ పడుతుంటారు. సాధారణంగా అటు

వంటి పేషెంట్స్‌కే తాత్కాలిక ఉపశమనంకోసం ఆ ఇంజెక్షన్స్ వాడతాం!"

"దయచేసి బాగా ఆలోచించి చెప్పండి. ఎప్పుడైనా ప్రసాదరావ్ అనే యువకుడికీ, రత్నరాశి అనే యువతికీ మీ రటువంటి డ్రగ్స్‌కోసం రెకమెండ్ జేసేరా?"

డాక్టర్ కాసేపు ఆలోచించి, "సారీ! చెప్పలేను. కారణం, రోజూ ఎంతోమంది వస్తూపోతుంటారు. పేర్లు జ్ఞాపకం వుండవు. ఇంతకీ యివన్నీ యెందుకు అడుగుతున్నారు?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఎందుకంటే, వాళ్ళిద్దరూ దయనీయంగా చంపబడ్డారు. వాళ్ళే కాదు. గత ఐదారురోజుల్నించీ నగరంలో విచిత్రమైన హత్యలు జరుగుతున్నాయి. హతులందరూ దాదాపు ఏదో ఒక మత్తు పదార్థానికి దాసులైనవారే!"

"ఈ విషయాలతో నాకేమిటి సంబంధం?"

"సంబంధం వుంది మిస్టర్ భార్గవా? హత్యజెయ్యబడ్డ రత్నరాశీ, ప్రసాదరావూ యిదే మెడికల్ షాప్‌లో డ్రగ్స్ తీసుకునేవారని మా దగ్గర సాక్ష్యం వుంది."

"కావచ్చు. దానికి నేనెలా బాధ్యుణ్నవుతాను?"

"సరే, మీరు ఆపరేషన్స్‌కూడా చేస్తారు కదూ?"

భార్గవ తలూపేడు.

"ఐ స్పెషలిస్ట్ కూడా అనుకుంటాను."

"ఔను..." అంటూ ఏదో జ్ఞాపకం వచ్చినట్టు పకపక నవ్వేడు భార్గవ. "ఓహో, ఇప్పుడర్థమైంది. కళ్ళు లేని ఆ శవాలకీ, నాకూ సంబంధం వున్నట్టు మీ రనుమానిస్తున్నారన్నమాట!"

నవ్వేను. "ప్రతి మనిషినీ అనుమానించడం పోలీసు

శాఖకి పుట్టుకతో వచ్చిన బుద్ధి కదా? అదలా వదలండి. మీకు డాక్టర్ వివేకానంద్ తెలుసా?"

"తెలుసు."

"ఆయన భార్య ఉపేక్షాదేవి తెలుసా?"

"తెలుసు!"

"ఎలా?"

"వాళ్ళిద్దరూ అప్పుడప్పుడూ క్లబ్బుకి వచ్చేవారు. అక్కడే పరిచయం."

"ఆమెకి మత్తుపదార్థాలు వాడే అలవాటుండేదా?"

"నాకు తెలియదు!"

"సో, ఆమె హత్య చెయ్యబడ్డట్టు మీకు తెలుసా?"

"తెలుసు. పేపర్లో చదివేను. చాలా ఆశ్చర్య పోయేను."

"ఈ నగరంలో వున్న డాక్టర్లలో సిక్ పట్టుకుని, కుంటుతూ నడిచే ఏ డాక్టరైనా తెలుసా మీకు?"

భార్గవ కాసేపు ఆలోచించి, "నో! తెలీదు" అన్నాడు.

"మీకీ నగరంలోని ప్రతి డాక్టర్‌తోనూ పరిచయం వుందనుకుంటాను."

భార్గవ తలూపేడు.

"వారిలో ఎవ్వరూ కుంటుతూ నడవరా?"

"నో. నో!"

"కంటి చికిత్సలో మంచి ప్రావీణ్యం గల ఏ డాక్టరైనా తెలుసా మీకు?"

"అటువంటి ఐ స్పెషలిస్ట్సు యెందరో వున్నారు."

"వారిలో ఎక్కువ వయసు లేనివాడూ, అందంగా, ఎర్రగా, పొడుగ్గా వుండేవాడూ, అందమైన కళ్ళు గల

ఆడవాళ్ళంటే పడి చచ్చేవాడూ, ఇలాటి ఐ స్పెషలిస్ట్ యెవ్వరైనా తెలుసా మీకు?''

భార్గవ నవ్వి, "తెలుసు!'' అన్నాడు.

"ఎవ్వరతను?'' అడిగేను ఆతృతగా.

"డాక్టర్ భార్గవ.''

అతని జవాబు విని నిర్ఘాంతబోయేను.

"డాక్టర్ భార్గవా! వేళాకోళాలంటే నాకు గిట్టదు'' అన్నాను సీరియస్‌గా.

అతను నవ్వి, "ఇందులో వేళాకోళం లేదే? మీరే చూస్తున్నారు కదా, నేను ఐ స్పెషలిస్ట్‌ని. ఎక్కువ వయసు లేనివాణ్ణి. అందంగా, ఎర్రగా, పొడుగ్గా వున్న వాణ్ణి. నిజం చెప్పాలంటే, అందమైన కళ్ళు గల ఆడదంటే పడి చచ్చేవాణ్ణికూడా.''

సాలోచనగా తలూపి, "ఐతే, మీకు అనేకమంది అందమైన ఆడవాళ్ళతో పరిచయం వుందన్నమాట!'' అన్నాను.

భార్గవ నవ్వి, "ఔను. ఉంది. కాని, వాళ్ళ పేర్లు తెలుసుకోడంవల్ల మీ కెలాటి లాభం వుండదు. కారణం, వాళ్ళింకా బ్రతికే వున్నారు'' అన్నాడు.

"ఆల్‌రైట్ డాక్టర్! ఈ విధంగా మీకు శ్రమ కలిగించినందుకు క్షమించండి. ఇక మీరు వెళ్ళవచ్చు'' అన్నాను.

భార్గవ లేచి వెళ్ళిపోయేడు.

"మీ ప్రొప్రైటర్ శ్రీకాంత్ గారి ఎడ్రస్ ఏమిటి?'' అడిగేను ప్రవీణ్‌కుమార్ని.

"తిరువాన్కూర్. 710-8-525. అక్కడ ఆయనకి పెద్ద ఆస్తి వుంది."

"భార్యాపిల్లలతో అక్కడే వుంటారన్నమాట."

"నో. నో. ఆయనకింకా పెళ్ళి కాలేదు!"

"ఆయన వయ సెంతుంటుంది?"

"ముప్పై ఐదేళ్ళుంటాయి."

"ఇంత చిన్న వయసా?"

తలూపేడు ప్రవీణ్ కుమార్.

"ఈ మెడికల్ షాప్ ప్రారంభించి ఎన్నేళ్ళయింది?"

"కేవలం మూడు సంవత్సరాలు."

"అంతకుముందు ఆయనేం జేసేవారు?"

"ఆయన డాక్టరు. ప్రైవేట్ డిస్పెన్సరీ నడిపేవాడు."

నాకు షాక్ తగిలినట్టు తోచింది. ఇంతవరకూ పరిచయమైనవాళ్ళంతా డాక్టర్లే! మెడిసిన్ చదివినవాళ్ళే. వయసులో వున్నవాళ్ళే.

హంతకుడూ డాక్టరేనని నా అనుమానం. ఆ హంతకుణ్ణి ప్రత్యక్షంగా చూసిన తోటమాలి వర్ణనబట్టి అతను అందమైనవాడు. వయసులో వున్నవాడు. కాని, చిక్కల్లా అతను చేతిలో స్టిక్ పట్టుకుని కుంటుతూ నడుస్తాడు. నాకు పరిచయమైన డాక్టర్లలో ఎవ్వరూ కుంటివాళ్ళు కారు. హంతకుడు పోలీసుల్ని తప్పుదారి పట్టించడానికే ఆ నాటక మాడుతున్నాడా?

"డాక్టర్ శ్రీకాంత్ ఇప్పుడు ప్రాక్టీసు పూర్తిగా మానేశారా?" అడిగేను.

ప్రవీణ్ కుమార్ తలూపి, "ఔను. ప్రాక్టీసుపట్ల ఆయనకి విసుగు పుట్టింది. దానికి బదులు, ఈ మెడికల్ షాప్

ఓపెన్ జేసి యిక్కడి కార్యభారమంతా నా కప్పగించి, ఆయన తిరువాన్కూర్‌లోని ఆస్తి విషయాలు చూసు కుంటూ అక్కడే వుంటున్నారు'' అన్నాడు.

''డాక్టర్ శ్రీకాంత్ ఎర్రగా, పొడుగ్గా, అందంగా వుంటారా?''

''ఔను. కాని, ఆయన స్టిక్ పట్టుకుని కుంటుతూ నడవరు!'' అన్నాడు ప్రవీణ్‌కుమార్ నవ్వుతూ.

''ఇంకా పెళ్ళికాలేదు గనక, ఆయనకి అందమైన ఆడ వాళ్ళ పిచ్చికూడా వుండి వుంటుంది?'' అన్నాను అతన్ని ఓరగా చూస్తూ.

ప్రవీణ్‌కుమార్ తల విదిలించి, ''ఆయన వ్యక్తిగత విషయాలు నాకు తెలీదు'' అన్నాడు.

''మిస్టర్ ప్రవీణ్‌కుమార్! దయచేసి, ఆయనకి ట్రంకాల్ జేసి ఇక్కడికి పిలిపించగలరా?'' అడిగేను.

అతను కాసేపు ఆలోచించి, ''ఆల్ రైట్! మీరు కోరు తున్నారు గనుక రిస్కు తీసుకోక తప్పదు'' అంటూ ఫోన్ దగ్గరికి లాక్కున్నాడు.

ఓ సేల్స్‌మెన్ హడావుడిగా లోనికి వచ్చి ''సార్! బాస్ వచ్చేరు'' అన్నాడు ప్రవీణ్‌కుమార్‌తో.

ప్రవీణ్‌కుమార్ వెంటనే లేచి బైటికెళ్ళేడు.

ఐదునిమిషాల తరవాత అతని వెంట ఫుల్‌సూట్‌లో ఉన్న ఓ వ్యక్తి లోనికి వచ్చేడు. అతన్ని చూడగానే అనుకున్నాను నా అంచనా తప్పుకాదని.

''డాక్టర్ శ్రీకాంత్ వీరే!'' అన్నాడు ప్రవీణ్‌కుమార్ అతన్ని పరిచయంజేస్తూ.

''వేరొకరైతే అంతదూరంనించి ఇలా ఉన్నపళంగా

వచ్చేవాణ్ణి కాదు. పోలీసులతో సహకరించడానికి నిరాకరించడం నా ప్రిన్సిపుల్స్‌కి విరుద్ధం!" అన్నాడు శ్రీకాంత్ షేక్‌హేండ్ ఇస్తూ.

అతను కూర్చున్నాక, ఒకదాని తరువాత ఒకటిగా అనేక ప్రశ్నలు వేసేను.

కొత్తవిషయాలేవీ తేలలేదు.

నగరంలో హత్యలు జరుగుతున్న వార్తలు పత్రికల్లో చదువుతున్నాననీ, ప్రసాదరావ్, రత్నరాశీ, జీవన్, ఉపేక్షా, డాక్టర్ వివేకానంద్, తీర్థనాథ్‌లతో తనకెలాంటి పరిచయం లేదనీ చెప్పేడు.

అతన్ని కలుసుకున్న తరవాత నాలో ఓ పథకం తళుక్కుమంది.

వారిదగ్గిర సెలవు తీసుకుని హెడ్‌క్వార్టర్స్‌కి బైలుదేరేను.

11

"డేవిడ్! ఈ కేసులో ముఖ్య అనుమానితుల జాబితా ఒకటి తయారుజేసేను. వీళ్ళందరూ డాక్టర్లు! యువకులు. అందమైనవాళ్ళు. ఆ తోటమాలి మనకి చెప్పిన వివరాలనిబట్టి, హంతకుడూ ఇవే ప్రత్యేకతలు కలవాడు. అతను చేతిలో స్టిక్ పట్టుకుని, కుంటుతూ నడవడం కేవలం నటన! మనల్ని తప్పుదోవ పట్టించడానికి వేసిన ఎత్తు.

సరే, ఈ రోజునించీ ఈ ఐదుగురి మీదా గట్టి నిఘా ఏర్పాటు జెయ్యాలి. వీళ్ళు ఎక్కడికి వెళ్ళినా, ఏంజేస్తున్నా మఫ్టీలో ఉన్న మన కానిస్టేబుల్స్ నీడలా వీరి కదలికలు కనిపెడుతుండాలి. దాంతో మన అనుమానం నిజమైనదో, లేక వట్టి అనుమానమో తేలిపోతుంది" అన్నాను.

"వీళ్ళందరూ డాక్టర్లన్నారుకదా? మరి వీరి మధ్య ఆ మెడికల్ షాప్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ని దేనికి జేర్చేరు?" అన్నాడు డేవిడ్ ఆశ్చర్యంగా లిస్టును పరిశీలిస్తూ.

నవ్వేను. "అతనూ డాక్టరే! అందుకే అంత పెద్ద మెడికల్ షాప్‌కి అతన్ని మేనేజర్‌గా నియమించేడు శ్రీకాంత్. మెడికల్ షాప్‌లో అతన్ని కలుసుకున్నప్పుడు చూసేను. కూర్చునే బల్లమీద 'డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎమ్.బి.బి.యస్.' అనే బోర్డు ఉండడం!"

"ఆల్ రైట్ సర్! మీ పథకం నాకు నచ్చింది. వెంటనే ఏర్పాట్లు చేద్దాం!" అంటూ లేచేడు డేవిడ్.

తర్వాత చురుకైన కానిస్టేబుల్స్‌ని ఎన్నుకుని, వాళ్ళకు అన్ని ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి, ఒక్కో డాక్టర్ని కనిపెట్టడానికి ఒక్కొక్కర్ని పంపేను.

12

రాత్రి సరిగ్గా పదిన్నరకి బల్లమీది ఫోన్ మోగింది.

ఆతృతగా రిసీవర్ అందుకుని, "ఎస్! రాజారెడ్డి స్పీకింగ్!" అన్నాను.

"నేను డాక్టర్ని వెంబడిస్తున్నాను సార్! ఏడుగంటల ప్రాంతంలో అతను గాంధీ పార్క్‌నించి ఓ యువకుణ్ణి వెంటబెట్టుకుని టాక్సీలో మీనంబాకం దగ్గర దిగేడు.

టాక్సీవాణ్ణి పంపేసి, యువకుడితో కాలినడకన శిథిలమైన ఇళ్ళవేపు పోతున్నాడు. అక్కడంతా నిర్మానుష్యంగా, చీకటిగా ఉంది."

"నీవు ఎక్కణ్ణించి మాట్లాడుతున్నావు?"

"ఓ రెస్టారెంట్‌నించి."

"వాళ్ళటు వెళ్ళి ఎంతసేపైంది?"

"ఇప్పుడే, ఐదు నిమిషాలై వుంటుంది. ఆ డాక్టర్ కుంటుతూ నడుస్తున్నాడు సార్!"

"ఆల్ రైట్, నువ్వక్కడే ఉండు. ఇప్పుడే వస్తున్నాం". అని రిసీవర్ దించి లేచేను.

"డేవిడ్! కమాన్, హరియప్" అంటూ బైటికి పరిగెత్తాను.

నలుగురు కానిస్టేబుళ్ళతో జీప్ ఎక్కి బైలుదేరాం. మీనంబాకం దగ్గర జీప్ దిగగానే, మఫ్టీ కానిస్టేబుల్ పరిగెత్తుకువచ్చి, శిథిలాల్లో వాళ్ళు ఏవైపు వెళ్ళారో చూపించేడు.

కానిస్టేబుల్స్ని ఆయుధాలతో ఆ శిథిలాలని చుట్టుముట్టమని చెప్పి, నేనూ, డేవిడ్ ఆవైపు అడుగులు వేశాం. బూట్సుల చప్పుడు కానివ్వకుండా విరిగిన గోడలూ, రాళ్ళూ రప్పలూ దాటుకుంటూ, కప్పు కూలిన ఓ గదిని సమీపించాం.

చుక్కల వెలుగులో మసకమసకగా కనిపిస్తున్నాయి పరిసరాలు. జేబులోంచి టార్చిలైట్ తీసి ఎడంచేతిలో పట్టుకున్నాను. హోల్స్టర్లోంచి రివాల్వర్ తీసి, సేఫ్టీ కాచ్ లాగి కుడిచేతిలో రెడీగా పట్టుకున్నాను.

లోపలినించి, సన్నసన్నగా ఏవో చప్పుళ్ళు వినిపిస్తున్నాయి.

గోడ చాటునించి చటుక్కున లోనికెళ్ళి, టార్చి వెలిగించేను.

ఓ మూల, నేలమీద పడుంది ఓ ఆకారం. దాని పక్కనే కూర్చుని ఏదో చేస్తున్న వ్యక్తి టార్చి వెలుక్కి అదిరిపడి వెనుదిరిగేడు.

నా కళ్ళని నేను నమ్మలేకపోయాను. అతనెవ్వరో కాదు. ఉపేక్ష భర్త, డాక్టర్ వివేకానంద్!

మమ్మల్ని చూడగానే పిడుగుపడ్డట్టు లేచి నిల్చు న్నాడు. అతని చేతులు రక్తసిక్తమై ఉన్నాయి.

"స్కౌండ్రల్! ఇన్నాళ్ళూ అందమైన యువతీ యువ కుల్ని హత్యజేస్తూ వాళ్ళ కళ్ళు పీకుతున్న కిరాతకుడివి నీవేనన్నమాట!" అన్నాను వళ్ళు తెలీని కోపంతో.

వివేకానంద్ పలకలేదు. చమట్లు కక్కుతూ రాతి బొమ్మలా నిల్చున్నాడు. అప్పటికే, డేవిడ్ జేబులోంచి సంకెళ్ళు తీసి అతన్ని సమీపించేడు. చేతులకి బేడీలు వేస్తున్నా, వివేకానంద్ నోరు విప్పలేదు.

నేలమీద పడున్న ఆ ఆకారం ఇంకా అలాగే చలన రహితంగా పడుంది. అనుమానం వేసి, టార్చి వెలుగులో అటు నడిచేను. వేరొకరైతే ఆ దృశ్యం చూసి కెవ్వుమనే వారు.

మేము చాలా ఆలస్యంగా వచ్చాం. వివేకానంద్ అప్ప టికే ఆ యువకుణ్ని చంపి, ఓ కన్ను తీసేశాడు. శవం పక్కన ఆపరేషన్ కోసం వాడే ఇన్స్ట్రుమెంట్స్ పడు న్నాయి. అన్నిటికీ రక్తం అంటి ఉంది.

వాటి మధ్యే తీసిన కన్నూ ఉంది.

వివేకానంద్ రెండో కన్ను తీస్తుండగా మేము వచ్చాం. పీకిన ఒంటికన్నుగుండా, రక్తం కారి వికృతంగా ఉంది శవం.

ఇక చూడలేక మొహం తిప్పుకున్నాను.

శవాన్నీ, హంతకుణ్నీ జీప్ ఎక్కించి హెడ్ క్వార్టర్స్ కి బయలుదేరాం.

* * *

మా పద్ధతులు ఉపయోగించేక నోరు విప్పేడు వివేకానంద్.

హాతులకీ, అతనికీ ఎటువంటి విరోధం లేదు. అతనికి కావలసిందల్లా అందమైన యువతీయువకుల కళ్ళు. ఆ కళ్ళను ప్రత్యేకమైన ప్లాస్టిక్ డబ్బాలలో, కెమికల్స్ మధ్య పెట్టి ప్యాక్ జేసి, రహస్యంగా విదేశాలకి పంపేవాడు.

ఆ కళ్ళు అక్కడ అంధులైన ధనవంతులకి అమర్చబడేవి. ప్రతిఫలంగా వివేకానంద్ పేర్న లక్షలకి లక్షలు విదేశీ బ్యాంకుల్లోనే జమ అయ్యేవి. అలా కొన్ని లక్షలు అక్కడ పోగయ్యేక ఈ దేశం విడిచి వెళ్ళి అక్కడే స్థిరపడాలని ప్లాన్ వేసేడు. అందుకే, అందమైన తన భార్యనీ మట్టుబెట్టి, ఆమె కళ్ళుకూడా పార్శిల్ జేసేడు.

హత్యలకోసం అతను ఎన్నుకున్న వ్యక్తులు అందమైనవాళ్ళేగాక, రకరకాల మత్తుపదార్థాలకి అలవాటుపడ్డవారు కావడం గమనించతగ్గ విషయం! వివేకానంద్ అటువంటి వాళ్ళని గాలించి, పరిచయం జేసుకుని వాళ్ళకి కావలసిన మత్తుపదార్థాలని దండిగా సప్లై జేస్తూ, వాళ్ళని పూర్తిగా వాటి పిచ్చిలో పడేసి, తన పని తేలిగ్గా జరుపుకునేవాడు.

అతని మీద కోర్టులో ఛార్జిషీటు దాఖలుజేశాం. బహుశా మరణశిక్ష పడవచ్చు.

ఏది ఏమైనా, పెథిడిన్, మార్ఫిన్ వంటి ఇంజక్షన్స్‌కి దాసులైన వ్యక్తులూ, నల్లమందు, గంజాయి, చరస్, లిపిటన్ వంటి విషపదార్థాలకి గులాములైన మనుషుల జీవితాలు నిరర్థకం, నిస్తేజం, నిశ్శబ్దం, చివరికి.

—: ఐపోయింది :—